డైనమిక్ జనంవాయిస్ తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
PRGI NO: TGTEL/26/A0383

# చెట్టు పడినా.. అధికారుల్లో చలనం లేదు!

## గుంతల రహదారి.. విరిగిన చెట్టు.. వాహనదారులకు నరకయాతన!

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 13:**
రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం మాందారిపేట నుంచి శాయంపేటకు వెళ్లే మార్గంలో రంగయ్యకుంట సమీపంలో భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చెట్టు విరిగి రోడ్డుపై పడి గంటలు గడుస్తున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. రహదారిపై చెట్టు అడ్డంగా పడిన విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూస్తారా? అంటూ నిలదీస్తున్నారు.





### గుంతల రహదారికి తోడు చెట్టు అడ్డంకి..

ఇదే ప్రాంతంలో రహదారి మొత్తం గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. వర్షం పడటంతో గుంతల్లో నీరు చేరి అవి కనిపించకపోవడంతో వాహనదారులు మరింత ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు గుంతలు.. మరోవైపు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు.. అయినా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తక్షణమే తొలగించాలని, గుంతలమయమైన రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# కంబాలపల్లి జీపీకి వైకుంఠ రథం వితరణ

## దివంగత హెడ్మాస్టర్ శ్రీరామ్ వెంకన్న--సరోజినీ దంపతుల జ్ఞాపకార్థం రూ.1.50 లక్షలతో ఏర్పాటు

**మహబూబాబాద్, సెప్టెంబర్ 13 (జనం వాయిస్):**
మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామపంచాయతీకి దివంగత పూర్వపు హెడ్మాస్టర్ శ్రీరామ్ వెంకన్న--సరోజినీ దంపతుల కుమారులు, గ్రామ ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో రూ. 1.50 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని అందజేశారు. గ్రామంలో పరమపదించిన వారి పార్థివదేహాలను గౌరవప్రదంగా ఊరేగింపుతో స్మశానవాటికకు తరలించాలనే సదుద్దేశంతో ఈ వైకుంఠ రథాన్ని తయారు చేయించారు. దివంగత శ్రీరామ్ వెంకన్న--సరోజినీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీరామ్ చంద్రశేఖర్, కమలాకర్, విజయకుమార్‌తో పాటు కంబాలపల్లి ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో రథాన్ని గ్రామపంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ... మనిషి జీవితంలో పుట్టుక ఎంత సహజమో, మరణం కూడా అంతే సహజమని, చివరి ప్రయాణాన్ని గౌరవప్రదంగా నిర్వహించాలనే ఉద్దేశంతో వైకుంఠ రథాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చీరిక వసంత ఉపేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కమటం యాకన్న, దాతలు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, కొలిశెట్టి సత్యనారాయణ, శ్రీరామ్ విజయకుమార్, గ్రామ పెద్దలు బెల్లంకొండ శ్రీనివాస్, వార్డు సభ్యులు చీరిక వేణురెడ్డి, కోమేరెల్లి పుల్యాల జైపాల్‌రెడ్డి, శిరంశెట్టి వేణు, కారింగుల రాజశేఖర్, ఇందుర్తి రవీందర్‌రెడ్డి, బొబ్బ వీరన్న, కొలిశెట్టి పురుషోత్తం, రామ్మూర్తి, కల్ల వెంకట్‌రెడ్డి, మాదారపు ఎల్లయ్య, రాయిశెట్టి సత్యం, సిబ్బంది బోట్ల వీరన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.




# స్నేహితుడి ప్రాణాల కోసం చిన్నారుల ఫండ్ కలెక్షన్

## బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న రితికేశ్వర్‌కు తోటి విద్యార్థుల అండ

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 13:**
స్నేహితుడి ప్రాణాలు కాపాడేందుకు చిన్నారులు చేపట్టిన ఫండ్ కలెక్షన్ పట్టణ ప్రజలను కదిలించింది. బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న తమ స్నేహితుడు రితికేశ్వర్ వైద్య ఖర్చుల కోసం తోటి విద్యార్థులు స్వచ్ఛందంగా విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. చిన్న వయసులోనే సేవాభావాన్ని చాటుతున్న విద్యార్థులను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. మందమర్రికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు వేనవంక నారాయణ కుమారుడు పదేళ్ల రితికేశ్వర్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్యానికి ఇప్పటికే సుమారు రూ. 45 లక్షలు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం రక్తంలో ఇన్ఫెక్షన్ కారణంగా మరో రూ. 35 లక్షల వరకు చికిత్స ఖర్చు అవుతుందని వైద్యులు సూచించినట్లు పేర్కొన్నారు.

**స్నేహితుడి కోసం రోడ్డెక్కిన చిన్నారులు**
రితికేశ్వర్ పరిస్థితిని తెలుసుకున్న అతని స్నేహితులు చలించిపోయారు. స్నేహితుడికి అండగా నిలవాలనే సంకల్పంతో పట్టణంలోని పలు వ్యాపార సముదాయాల్లో స్వయంగా ఫండ్ కలెక్షన్ చేపట్టారు. చిన్నారులు తమ స్నేహితుడి కోసం విరాళాలు కోరుతుండటంతో పలువురు వ్యాపారులు, ప్రజలు స్పందించి తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టకాలంలో స్నేహితుడికి అండగా నిలవడమే నిజమైన స్నేహమని ఈ చిన్నారులు చాటిచెప్పారని పలువురు అభినందించారు. రితికేశ్వర్ చదువుతున్న పాఠశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు కూడా ఇప్పటికే తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు.

**దాతల సహాయం కోసం తండ్రి వేడుకోలు**
తన కుమారుడికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని తండ్రి వేనవంక నారాయణ వేడుకుంటున్నారు. ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించేందుకు సహకరించాలని కోరుతున్నారు.
సహాయం చేయదలచిన వారు:
**వేనవంక నారాయణ**
**99491 56031**
గూగుల్ పే, ఫోన్ పే ద్వారా తమకు తోచిన ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రితికేశ్వర్ త్వరగా కోలుకుని తిరిగి తమతో కలిసి చదువుకోవాలని, ఆడుకోవాలని అతని స్నేహితులు ఆకాంక్షిస్తున్నారు. చిన్నారుల స్నేహభావం, సేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

# జనగామ జిల్లాలో తస్మా ఆధ్వర్యంలో ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు వేడుకలు

**సెప్టెంబర్ 13 జనం వాయిస్ పాలకుర్తి:**
60 పాఠశాలలు.. 120 మంది ఉత్తమ ఉపాధ్యాయులు.. వారిలో సుధా హై స్కూల్‌కు చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన గురువులకు ప్రత్యేక గౌరవం. జనగామ--సూర్యాపేట రోడ్డులోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సుధా హై స్కూల్‌కు గర్వకారణంగా నిలిచిన ఇద్దరు గురువులు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వేడుకల్లో సుధా హై స్కూల్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు దొడ్డ సత్యనారాయణ, బి. నరేందర్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డులు అందుకోవడం పాఠశాలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, క్రమశిక్షణను అలవర్చడం, నైతిక విలువలను పెంపొందించడం, విద్యలో ముందుకు నడిపించడం వంటి ఎన్నో అంశాల్లో ఈ ఇద్దరు ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవం అందించారు. సుధా హై స్కూల్ ప్రిన్సిపాల్ రాపాక విజయ్ కుమార్, డైరెక్టర్ నీలిమ, ఉపాధ్యాయ బృందం ఈ సందర్భంగా దొడ్డ సత్యనారాయణ, బి. నరేందర్‌లను అభినందించారు. అలాంటి గురువులను గౌరవించడం అంటే భవిష్యత్ తరాలను గౌరవించడమే అని కొనియాడారు.




# హిందీ భాషా వికాసానికి విశేష కృషి చేస్తున్న బిశారద.

**సెప్టెంబర్ 13 జనం వాయిస్ పాలకుర్తి:**
శారద విద్యార్థులకు హిందీ భాషను కేవలం పాఠ్యాంశంగా మాత్రమే కాకుండా, సులభమైన మరియు ఆసక్తికరమైన బోధనా పద్ధతుల ద్వారా నేర్పిస్తూ విద్యార్థులలో భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నారు. వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి నాలుగు ప్రధాన భాషా నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. హిందీ భాషపై విద్యార్థుల్లో మరింత ఆసక్తి కలిగించేందుకు హిందీ కవితలు, కథలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సంభాషణ కార్యక్రమాలు, పాటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, భారతదేశ భాషా వైవిధ్యంలో హిందీకి ఉన్న ప్రత్యేక స్థానాన్ని తెలియజేశారు. మన మాతృభాషను గౌరవిస్తూనే ఇతర భాషలను కూడా నేర్చుకోవడం ద్వారా జ్ఞానాన్ని, స్నేహభావాన్ని మరియు జాతీయ సమైక్యతను పెంపొందించుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా వినూత్న బోధనా పద్ధతులను ఉపయోగిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం శారద ప్రత్యేకతగా పలువురు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే విధానాన్ని గుర్తించి, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. అలాగే విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, జాతీయ భావన, భాషా సంస్కృతి మరియు సృజనాత్మకతను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఒక ఉత్తమ ఉపాధ్యాయినిగా విద్యార్థులకు మార్గదర్శకురాలిగా నిలుస్తూ, పాఠశాల అభివృద్ధిలోనూ తన వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా JC(G) పాలకుర్తి ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు బి.శారద హిందీ దివస్ శుభాకాంక్షలు తెలియజేశారు. హిందీ భాషాభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బి .శారద మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.



# సింగరేణి 62వ వార్షిక క్రీడా, సాంస్కృతిక పోటీలు ప్రారంభం

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 13:**
సింగరేణి మందమర్రి ఏరియా ఆధ్వర్యంలో 62వ వార్షిక క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సీఈఆర్ క్లబ్, సింగరేణి మైదానంలో నిర్వహించిన పోటీలను సీనియర్ పీఓ కార్తీక్, ఏఐటీయూసీ నాయకుడు ముల్కలపల్లి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. చెస్, క్యారమ్, బాడీబిల్డింగ్, లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, సోదరభావాన్ని పెంపొందిస్తాయని కార్తీక్ తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొని సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పెద్దపల్లి బాణాయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.





# ఉచిత మట్టి గణపతిలు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్.

**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 13:**
పెద్దపెల్లి జిల్లా మంథని లోని గాంధీ చౌక్ లో ఆదివారం ఉచితంగా మట్టి గణపతి లను మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతి లను పూజించండి పర్యావరణాన్ని కాపాడుదాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్ కుర్ర లింగయ్య, వంశీ, లసెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఈఎన్‌టీ సమస్యలకు ఐదు రోజుల ఉచిత వైద్య శిబిరం..

## డాక్టర్ ఆర్. శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్‌లో మెగా శిబిరం

**జనం వాయిస్,వరంగల్,సెప్టెంబరు 13:**
ఈఎన్‌టీ సమస్యలతో బాధపడుతున్న వారికి అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ శుభవార్త అందించింది. ప్రముఖ ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆర్. శ్రవణ్‌కుమార్ ఎంబిబిఎస్,ఎమ్మెస్ (ఈ ఎన్ టి ) ఆధ్వర్యంలో ఐదు రోజుల ఉచిత ఈఎన్‌టీ శస్త్రచికిత్స మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనుంది. సెప్టెంబరు 15 నుంచి 19 వరకు జరిగే ఈ శిబిరంలో వివిధ ఈఎన్‌టీ సమస్యలకు నిపుణుల వైద్య సేవలు అందించనున్నారు.




**సమస్య ఏదైనా.. నిపుణుల పరీక్ష**
చెవినొప్పి, వినికిడి తగ్గడం, తరచూ జలుబు, ముక్కు దిబ్బడ, గొంతునొప్పి, మింగడంలో ఇబ్బంది, తలనొప్పి, సైనసైటిస్, చెవిలో మోగుడు శబ్దం, ముక్కు నుంచి రక్తస్రావం తదితర సమస్యలకు డాక్టర్ ఆర్. శ్రవణ్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, సూచనలు అందించనున్నారు.

**ఉచిత ఓపీ.. ప్రత్యేక పరీక్షలు**
శిబిరంలో ఉచిత ఓపీ, అంతర్గత పరిశీలన పరీక్ష, వినికిడి పరీక్షలు నిర్వహించనున్నారు. థైరాయిడ్, రక్త పరీక్షలపై 50% శాతం రాయితీ కల్పించనున్నారు. అవసరమైన వారికి ఈఎన్‌టీ శస్త్రచికిత్సకు సంబంధించిన వైద్య సలహాలు అందించనున్నట్లు అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.

**ఐదు రోజులే.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**
సెప్టెంబరు 15 నుంచి 19 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తపేట క్రాస్‌రోడ్, ఆరెపల్లి, వరంగల్‌లోని అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్లో శిబిరం కొనసాగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈఎన్‌టీ సమస్యలకు సకాలంలో వైద్య సలహాలు, చికిత్స పొందాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది. సంప్రదించగలరు. శిబిరానికి సంబంధించిన వివరాలు, ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం : 9459875555..నంబర్‌లో సంప్రదించగలరు.

# గుంతలమయంగా రామన్ కాలనీ ఫ్లైఓవర్

## మరమ్మతులతో సరిపెడుతున్నారా.. శాశ్వత పరిష్కారం ఎక్కడ?

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 13:**
మందమర్రి రామన్ కాలనీ రైల్వే ట్రాక్‌పై నిర్మించిన ఫ్లైఓవర్ గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి ప్రారంభమైనప్పటి నుంచి పలుమార్లు మరమ్మతులు చేపట్టినా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కనున్న ప్రహరీ గోడలకు పగుళ్లు ఏర్పడినా సిమెంట్ పూతలతోనే సరిపెడుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణ నాణ్యతలో లోపాలున్నాయా? లేక నిర్వహణలో నిర్లక్ష్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రివేళలు, వర్షాల సమయంలో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఫ్లైఓవర్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, నాణ్యమైన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# మట్టి వినాయకులను పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

## ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 13:**
వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించాలని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ పిలుపునిచ్చింది. మందమర్రి పట్టణంలోని 11వ వార్డులో సొసైటీ ఆధ్వర్యంలో "మట్టి వినాయకులను పూజిద్దాం--ప్రకృతిని కాపాడుదాం" అనే సందేశంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారైన విగ్రహాలకు బదులుగా సహజ మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. మట్టి విగ్రహాలు నిమజ్జనం అనంతరం సహజంగా కలిసిపోవడంతో నీటి కాలుష్యం తగ్గి జలచరాలకు మేలు జరుగుతుందని తెలిపారు. "ఒక్క కుటుంబం--ఒక్క మట్టి వినాయకుడు" అనే సంకల్పంతో ప్రతి కుటుంబం పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పూజా సామగ్రిని నీటిలో వేయకుండా తగిన విధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజకుమార్, జిల్లా కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, గోపాల్, చిలుముల రాజు, కుమార్, సోమమ్మ, లచ్చమ్మ, పుష్ప దేవమ్మ, లక్ష్మి, రాధ, శోభారాణి, పరమేశ్వరి, లావణ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.



# నూతన సీఐ భరత్ సుమన్‌ను కలిసిన: బీఆర్ఎస్ శ్రేణులు.

**సెప్టెంబర్ 13 జనం వాయిస్ పాలకుర్తి:**
పాలకుర్తి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భరత్ సుమన్‌ను పాలకుర్తి బీఆర్ఎస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఐ భరత్ సుమన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పాలకుర్తి సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు తమవంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్ రావు , పాలకుర్తి బి ఆర్ ఎస్ మాజీ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, పాలకుర్తి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గడ్డం కిరణ్ ఉపసర్పంచ్ గాదపాక కిరణ్, ఇతర గ్రామాల సర్పంచులు వార్డ్ మెంబర్లు మరియు కార్యకర్తలు, ఇన్చార్జిలో, యూత్ నాయకులు పలువురు బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

